సీఎంఆర్‌ఎఫ్ మంజూరుపత్రం అందజేత



మంజూరుపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీకి చెందిన రజిత అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ. 2.30 లక్షల సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాన్ని శుక్రవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి, కాశీనాథ్ యాదవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దర్శన్..



ఓపెన్ డ్రైన్‌ను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో శుక్రవారం బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పనగేష్ కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షంపడితే అశోక్‌నగర్, జ్యోతినగర్ కాలనీల మధ్యలో ఉన్న ఓపెన్ డ్రైన్ నిండి రోడ్లపైకి పెద్ద ఎత్తున నీరు చేరుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ ఓపెన్ డ్రైన్ నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

ఐఎస్‌ఓఎస్‌ఎస్ ఫ్యాకల్టీ డా.సుశాంత్‌కు బెస్ట్ టీచర్ అవార్డు



డా.సుశాంత్‌కుమార్ మహపాత్ర

సాక్షి సిటీబ్యూరో: ఇక్ఫాయి ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఐఎఫ్‌హెచ్‌ఈ) డీమ్డ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (ఐఎస్‌ఓఎస్‌ఎస్) ఫ్యాకల్టీ డాక్టర్ సుశాంత్‌కుమార్ మహపాత్రకు 'ఎస్‌జే యశస్వి బెస్ట్ టీచర్' అవార్డు లభించింది. ఇక్ఫాయ్ యూనివర్సిటీలో ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవం సందర్భంగా సుశాంత్‌కుమార్‌కు అవార్డుతో పాటు సర్టిఫికెట్, లక్ష రూపాయల నగదు పురస్కారం అందించారు. ఏఐసీటీఈ చైర్మన్ డాక్టర్ టీజీ సీతారామ్, వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎల్ఎస్ గణేష్, ఐఎఫ్‌హెచ్‌ఈ చాన్స్‌లర్ డాక్టర్ సి రంగరాజన్ సమక్షంలో సుశాంత్‌కుమార్ అవార్డు అందుకున్నారు. ఉన్నత విద్యాసంస్థలలో అత్యుత్తమ విద్యాబోధన, పరిశోధన, పరిశ్రమలతో విద్యాసంస్థ సత్సంబంధాలు పెంపొందించే వారికి ఈ అవార్డును అందిస్తారు. కాగా ఆయన పలు ఉన్నత పదవులలో కొనసాగారు. ఈ సందర్భంగా ఆయనను ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

చందానగర్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్ డబుల్ ఇళ్లలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఇళ్ల సముదాయం చుట్టు ప్రహరి నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, సీసీ రోడ్లు వేయాలని, మంచినీటి బోరు వేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే డబుల్ ఇళ్లను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గౌతమ్ గౌడ్, డబుల్ ఇళ్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సుదేష్ కుమార్, ఉపాధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, సక్రు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో వర్క్‌షాప్



రాయదుర్గం: మనూలో ఉర్దూ మీడియం టీచర్ల వృత్తిపరమైన అభివృద్ధి కేంద్రం (సీపీడీయూఎంటీ) ఆధ్వర్యంలో టీచర్స్ కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలపై ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో జహీరాబాద్ మండలానికి చెందిన 197 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జర్నలిజమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు మెరాజ్ అహ్మద్, సయ్యద్ ముజాహిద్‌పాషాలు ఏఐ ఆధారిత అసెస్‌మెంట్ టూల్స్‌తో వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జహీరాబాద్ మండల విద్యాశాఖాధికారి బసవరాజ్, నోడల్ అధికారి కోహిర్ జకీర్ సాహెబ్, జహీరాబాద్‌లోని లతీఫ్‌నగర్‌లోని ఇస్లామిక్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా ఇవ్వాలి

రాయదుర్గం: పేదవారికి మేమున్నామనే భరోసా ఆర్‌కేవై టీమ్ కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ సూచించారు. గోపన్‌పల్లిలో ఆర్‌కేవై టీమ్ పేదవారికి గొడుగులను పంపిణీ చేయతలపెట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రాలు, వర్షాకాలంలో గొడుగులు, చలికాలంలో దుప్పట్లు, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేయాలని సూచించారు. ఆర్‌కేవై టీమ్ సభ్యులు జాజిరావు, శ్రీనివాస్, రాము, నరేష్, బీజేపీ నాయకులు ఆకుల లక్ష్మణ్‌ముదిరాజ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

19 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 19 మందికి రూ. 2 వేల చొప్పున జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... బుధవారం,గురువారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ లో 19 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా,జడ్జి 19 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఇరుకు రోడ్డు.. ఇబ్బందులు



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బారులుదీరిన వాహనాలు



బ్రిడ్జి వద్ద పైప్‌లైన్, ఒక్క వాహనం మాత్రమే వెళ్లగలిగిన దారి

- లింక్‌రోడ్డులోని రైల్వే అండర్ పాస్ విస్తరణ జరిగేనా...?
- తాత్కాలిక సిగ్నళ్లు.. నిత్యం ట్రాఫిక్ జామ్‌లు.. వాహనదారుల కష్టాలు

సమస్యలివే..

- రైల్వే అండర్‌బ్రిడ్జి కింద రోడ్డు మురుగు కాలువ వల్ల ఇరుకుగా మారింది.
- కేవలం ఒక వాహనం వెళ్లే విధంగా ఉండడంతో తాత్కాలికంగా సిగ్నల్ ఏర్పాటు చేశారు.
- ఇరుకు రోడ్డులోనే నాలా ఏర్పాటుతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- సిగ్నల్ వల్ల ఉదయం, సాయంత్రం భారీగా ట్రాఫిక్ జాంలతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.
- సిగ్నల్ సమయం తక్కువగా ఉండడం వల్ల కార్లు గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలీనగర్ నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు రోడ్డును విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. వైశాలీనగర్ నుంచి బొటానికల్ గార్డెన్, మసీద్ బండలకు వెళ్లే లింకురోడ్డు రైల్వే బ్రిడ్జి వరకు తరువాత మసీద్‌బండ వరకు రోడ్డు పూర్తి అయినప్పటికీ ఈ బ్రిడ్జి కింద రోడ్డు ఇరుకుగా మారింది. ఈ రోడ్డులోనే మురుగు నీటి పైప్‌లైన్ ఉండడంతో రోడ్డు చిన్నదిగా మారిపోయింది. మదీనాగూడ, చందానగర్, మియాపూర్ నుంచి గచ్చిబౌలికి వెళ్లేవారు ట్రాఫిక్ లేకుండా సమయం ఆదా అవుతుందని ఇటువైపు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా కొన్ని నెలల క్రితం తాత్కాలికంగా సిగ్నల్ ఏర్పాటు చేశారు. కానీ ఉదయం, సాయంత్రం సమయాలలో ట్రాఫిక్ పెరిగిపోతుండడంతో వాహనదారుల కష్టాలు వర్ణనాతీతం. అండర్ బ్రిడ్జి నుంచి ఇరువైపులా వాహనాలు ఇష్టానుసారంగా రాకుండా డివైడర్‌ను ఏర్పాటు చేయాలి. కాగా ఎంపీ, ఎమ్మెల్యేలు రైల్వే అధికారులతో మాట్లాడి రోడ్డు విస్తరణ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డులో డివైడర్ లేకపోవడం వలన ఇష్టానుసారంగా వస్తున్న వాహనాలు

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక సిగ్నల్ వల్ల ఉదయం, సాయంత్రం సమయాలలో భారీగా ట్రాఫిక్ సమస్య ఉంటుంది. అండర్ బ్రిడ్జి నుంచి ఇరువైపులా వాహనాలు ఇష్టానుసారంగా రాకుండా డివైడర్‌ను ఏర్పాటు చేయాలి. -కృష్ణ, వాహనదారుడు

బ్రిడ్జి విస్తరణ చేయాలి



రైల్వే అండర్ బ్రిడ్జి కింద మురుగునీటి కాలువతో పాటు ఒక వాహనం వెళ్లే విధంగా రోడ్డు ఉండడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు కురిస్తే వరద నీరు బ్రిడ్జి కిందకు చేరుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అండర్ పాస్ బ్రిడ్జి విస్తరణ చేపట్టాలి. - సుధాకర్, వాహనదారుడు

దరఖాస్తుల సమర్పణకు 28 ఆఖరు

'మనూ'లో ఐటీఐ మూడోదశ కౌన్సిలింగ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ) హైదరాబాద్‌లోని వివిధ ట్రేడ్‌లలో ప్రవేశానికి మూడవ దశ కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐటీఐ హైదరాబాద్ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ తెలిపారు. దరఖాస్తులను సమర్పించడానికి ఆగస్టు 28వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాన్ని 'మనూ' ఐటీఐ హైదరాబాద్ నుంచి పొందవచ్చని లేదా యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు.. కార్యాలయంలో వ్యక్తిగతంగా కానీ లేదా ఫోన్ నంబర్లు 040-23008428, 9440692452లో సంప్రదించాలని సూచించారు.

ప్రత్యేక పూజలు



రాయదుర్గం: శ్రావణమాస సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని శుక్రవారం గణేశుడికి ప్రత్యేక పూజలు చేశారు. బెల్లం ముద్దలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని అన్నపూర్ణాదేవికి అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

26న డిజిటల్ లెర్నింగ్ ఆఫ్ ఇంగ్లిష్ వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఈనెల 26వ తేదీ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ విభాగం అధిపతి ప్రొ.నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా 'ఇన్‌ఫార్మల్ డిజిటల్ లెర్నింగ్ ఆఫ్ ఇంగ్లిష్(ఐడీఎల్‌ఈ) అండ్ జనరేటివ్ ఏఐ ఇన్ లాంగ్వేజ్ టీచింగ్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై సదస్సు ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ది ఎడ్యుకేషన్ యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్ నుంచి విద్యావేత్తలు హాజరవుతారన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

మియాపూర్: వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై మియాపూర్ పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. మియాపూర్ సీఐ దుర్గరామలింగప్రసాద్ తెలిపిన ప్రకారం.. మియాపూర్‌లోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి ఎస్‌ఓటీ, మియాపూర్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఓ మహిళ (62) మరో ఇద్దరు మహిళలతో పాటు ఓ యువకుడిని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి విచారించగా వ్యభిచారం చేస్తున్నట్లు అంగీకరించారు. వారి వద్ద నుండి 4 సెల్‌ఫోన్లు, కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

29 నుంచి ఫ్రెండ్లీ పోలీస్ వాలీబాల్ టోర్నమెంట్

చందానగర్ : చందానగర్ పీజేఆర్ స్టేడియంలో మాదాపూర్ జోన్ పోలీస్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ పోలీస్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చందానగర్ ఎస్‌హెచ్‌ఓ పాలవెల్లి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే టీమ్‌లు ఈ నెల 28వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రైజ్‌మనీ ఉంటుందన్నారు. సీనియర్ జాతీయ ఆటగాళ్లకు, పోలీస్ విభాగానికి సంబంధించిన ఆటగాళ్లకు టోర్నమెంట్‌లో ఆడడానికి అనుమతి లేదన్నారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని, డ్రెస్ కోడ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునే వారు ఫోన్ : 9966061666, 9701859999లకు సంప్రదించవచ్చన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్ : వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- ఇక్రిశాట్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.00 గంటల వరకు గ్రీన్‌హిల్స్ అపార్ట్‌మెంట్స్, ఆర్‌వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్, ఇక్రిశాట్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- మాధవనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి 11.00 గంటల వరకు మాతృశ్రీనగర్ పార్క్ ఏరియా, ఎస్‌బీఐ బ్యాంక్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.
- కళ్యాణ్ గార్డెన్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు మియాపూర్ ప్రధానరోడ్డు, బొమ్మరిల్లు రెస్టారెంట్ ఏరియా, రాజారాం కాలనీ, మాధవనగర్, అంబేద్కర్‌నగర్, నందినగర్ ఏరియాలలో..
- విశ్వంభర ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విశ్వంభర కాలనీ, శిల్ప ఎవెన్యూ ప్రాంతాలలో..

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో....

- మదీనాగూడ, హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని హనుమాన్ టెంపుల్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి 11.30 గంటల వరకు మదీనాగూడ విలేజ్, ప్రణామ్ హాస్పటల్ ఏరియా, మల్లన్న టెంపుల్ ప్రాంతాలలో..
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్ కాలనీ ఏరియాలలో..
- మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ మెయిన్‌రోడ్డు, హనీఫ్ కాలనీ ప్రాంతాలలో..
- వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.00 గంటల వరకు వైశాలీనగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, ఏపీఎస్‌జీఓ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో....

- ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్, హుడా కాలనీలో కొంత మేర, కెఎల్ఎం షాపింగ్ మాల్ వెనుక ఉన్న ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుమన్ పేర్కొన్నారు.
- చందానగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 3.30 గంటల వరకు చందానగర్, అను ఫర్నిచర్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా 33/11కేవీ హెచ్‌ఎంటీ హిల్స్ సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు జలవాయువిహార్, సమతానగర్, విజేత సూపర్ మార్కెట్ లైన్‌లు, ఉదయం 12 నుంచి 12:30 గంటల వరకు..

- శ్రీనివాసం 11 కేవీ ఫీడర్ పరిధిలో.. హెచ్‌ఎంటి సబ్‌స్టేషన్ పరిధిలోని జయనగర్ 1 నుంచి 4 రోడ్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: ఐపీఆర్‌సీఎల్ ఫీడర్ పరిధిలో.. శనివారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు గచ్చిబౌలి, ఐపీఆర్‌సీఎల్, హిల్ రిడ్జ్ విల్లాస్, ఉదయం 11.00 గంటల నుంచి 11.30 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, జేవీ కాలనీ, ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బ్రహ్మకుమారీస్ ఫీడర్ పరిధిలోని గచ్చిబౌలి, రాక్‌ఎన్‌క్లేవ్, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జీపీఆర్ఏ ఫీడర్ పరిధిలోని గచ్చిబౌలి, గ్రీన్‌ల్యాండ్ కాలనీ, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

సోలార్‌తో విద్యుత్ బిల్లుల బాధ ఉండదు

బంజారాహిల్స్: విద్యుత్ బిల్లుల బాధ నుంచి ఉపశమనం పొందేందుకు సౌర విద్యుత్ పరిష్కారమని తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ ఎస్. జానయ్య అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో భాసు ఎనర్జీ సిస్టమ్స్, సాత్విక్ సోలార్ సంస్థతో జరిగిన వ్యూహాత్మక ఒప్పంద కార్యక్రమంలో ఆయన రెడ్ క్రాస్ కార్యదర్శి అజయ్ మిశ్రాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులు సౌర విద్యుత్ వాడుకునేందుకు ముందుకు వస్తే ప్రభుత్వం పెద్ద ఎత్తున సబ్సిడీ ఇస్తుందన్నారు. అనంతరం వారు స్వదేశీ టెక్నాలజీతో తయారు చేసిన సోలార్ పానెల్స్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాసు ఎనర్జీ సిస్టమ్స్ ఎల్ఎల్‌పీ ఫౌండర్, చైర్మన్ సురేష్, శంతను సిర్సాత్, సాత్విక్ సోలార్ నేషనల్ సేల్స్ హెడ్ పుష్పేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టలక్ష్మీ హోమం

ఫిలింనగర్: శ్రావణ శుక్రవారం సందర్భంగా ఫిలింనగర్ దైవసన్నిధానంలో అష్టలక్ష్మీ హోమాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఈ హోమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి



అతిథులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల హుడా కాలనీలోని వికాస్ లీడర్‌షిప్ స్కూల్ ఎపిస్టిమో మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఈఎంయుఎన్) ప్రోగ్రామ్‌కు వేదికగా మారింది.ఈ కార్యక్రమాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ రాయబారి డాక్టర్ ఎం.ఏ. నజీబ్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సహకారం ప్రాధాన్యతపై వివరించారు. ప్రిన్సిపాల్ పద్మ కొల్లి మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ సదస్సులో 6వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి, యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్, నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా కమిటీ ఇలా వివిధ దేశాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ కార్యక్రమానికి పలు స్కూల్స్‌కు చెందిన 400 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

తాజ్‌కృష్ణాలో జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

బంజారాహిల్స్: జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్ శుక్రవారం బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ప్రారంభమైంది. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆభరణాల ప్రదర్శన ఉంటుంది. ప్రపంచ ప్రఖ్యాత డిజైనర్లు తమ బ్రాండ్లను ఈ ప్రదర్శనలో ఉంచారు. అరుదైన, కనువిందు చేసే డిజైనర్ ఆభరణాలు ప్రదర్శనలో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి .ప్రారంభోత్సవంలో సోనియా చావ్లా, నమ్రత సాధ్వాని, అనికా కారా, ఆంచల్ బన్సాల్, దీపిక, సుధారెడ్డి, పూనం పారక్, రేఖా సేథియా, రాఖీ సురారా తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌లు కళకళ

- వ్యాయామం వైపు ప్రజల చూపు
- సద్వినియోగం చేసుకుంటున్న యువత, సీనియర్ సిటిజన్స్
- మిగతా కాలనీల్లోనూ ఏర్పాటు చేయాలని వినతి



వివేకానందనగర్ పార్కులోని ఓపెన్‌జిమ్‌లో వ్యాయామం చేస్తున్న యువత

ఆల్విన్‌కాలనీ: ప్రస్తుతం ఉరుకులు, పరుగుల కారణంగా శరీరానికి వ్యాయామం లేక రోగాల బారిన పడుతున్నారు. ఆరోగ్యవంతమైన జీవితం కోసం తప్పనిసరిగా వ్యాయామం చేయాలని వైద్యులు కూడా సూచిస్తున్నారు. యువత వేల రూపాయలు చెల్లించి జిమ్‌లకు వెళుతున్నారు. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ ఓపెన్‌జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దీంతో పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుతో వ్యాయామం వైపు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కాలనీలవాసులు ఉదయం, సాయంత్రం వ్యాయామం చేస్తున్నారు. బహిరంగ ప్రదేశంలో జిమ్‌లు కొత్త అనుభూతిని కలిగిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కూకట్‌పల్లి వివేకానందనగర్, ఆస్‌బెస్టాస్ కాలనీలోని పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కళకళలాడుతున్నాయి. ఇదే తరహా ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేయాలని పలు కాలనీల అసోసియేషన్‌లు విన్నవిస్తున్నాయి.

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాల్సిన కాలనీలు, ప్రదేశాలు

- ఆల్విన్‌కాలనీ ఫేజ్1లో సాయి కల్యాణ మండపం ఎదురుగా ఉన్న కమ్యూనిటీహాల్, ఫేజ్ 2లోని జలకన్య హోటల్ ఎదురుగా ఉన్న పార్కు, నాలాకు ఇరువైపులా ఉన్న ఖాళీ ప్రదేశంలో, అదే విధంగా ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న మైదానంలో, ధరణినగర్ కనకదుర్గమ్మ దేవాలయం సమీపంలో, జగద్గిరిగుట్ట వేంకటేశ్వరనగర్ కమ్యూనిటీ హాల్‌లో, మాధవరం కాలనీ ప్రధాన కూడలిలోని ఖాళీ ప్రదేశంలో, పాపిరెడ్డి నగర్ రెడ్డి సంఘం భవనం వద్ద, సాయినగర్‌లో సాయిబాబా దేవాలయం సమీపంలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని సంక్షేమ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఈ ప్రదేశాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దూరం వెళ్లాల్సి వస్తుంది



మా కాలనీలో జిమ్ సెంటర్ లేకపోవటంతో వివేకానందనగర్ కాలనీలోని పార్కులో గల ఓపెన్‌జిమ్‌కు వెళ్లాల్సి వస్తోంది. సమయం వృథా అవుతుంది. అంతేకాకుండా పరికరాలు అందక ఇబ్బందిగా ఉంది. వేంకటేశ్వరనగర్‌లో కూడా ఓపెన్ జిమ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.
- సతీష్, వేంకటేశ్వరనగర్ నివాసి

జిమ్ సెంటర్లలో ఫీజులు కట్టలేం



పార్కులు, మైదానాలు లేకపోవటంతో ప్రధాన రహదారుల్లోనే వాకింగ్, జాగింగ్ చేస్తున్నాము. ఈ క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాలనీల్లో ఏదో ఒక కమ్యూనిటీ హాల్ సెంటర్‌లను గుర్తించి ఖాళీ ప్రదేశంలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుంది. జిమ్ సెంటర్‌లలో ఫీజులు చెల్లించలేక యువత వెనుకంజ వేస్తున్నారు. - కుమార్‌యాదవ్, ఆల్విన్‌కాలనీ